క్లుప్తంగా

ఇద్దరు ఎస్సైల బదిలీ

ఎర్రుపాలెం/బోనకల్: మధిర సర్కిల్ పరిధిలో ఇద్దరు ఎస్సైలను బదిలీ చేశారు. ఇందులో భాగంగా ఎర్రుపాలెం ఎస్సై పి.వెంకటేష్ ఖమ్మం హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈ స్థానంలో ఖమ్మం త్రీ టౌన్ ఎస్సై ఎం.రమేష్‌కుమార్‌ను నియమించారు. అలాగే, బోనకల్ ఎస్సై మధుబాబును కూడా సీసీ కార్యాలయానికి అటాచ్ చేయగా, ఖమ్మం ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న పొదిలి వెంకన్నను బోనకల్‌కు కేటాయించారు. కాగా, ఒకేరోజు సర్కిల్ పరిధిలోని ఇద్దరు ఎస్సైలను బదిలీ చేయడం, ఇద్దరికీ పోస్టింగ్ ఇవ్వకపోవడం గమనార్హం.

వచ్చే నెల 1 నుంచి ఉచిత కరాటే శిక్షణ

సత్తుపల్లిటౌన్: వేసవి ఉచిత కరాటే శిక్షణ తరగతులు మే 1 నుంచి స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించబడతాయని కరాటే మాస్టర్ పిచ్చయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

కాంగ్రెస్‌ను విమర్శించడం గర్హనీయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తల్లాడ: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడి, ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. తల్లాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం మండల, సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి మాట్లాడారు. ఎల్కతుర్తి సభకు సత్తుపల్లి నియోజకవర్గం నుంచి జనం వెళ్లకుండా మట్టా దయానంద్ అడ్డుకున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు చెప్పడం గర్హనీయమన్నారు. నాయకులు ఎర్రి కృష్ణమూర్తి, గోవింద్ శ్రీనివాసరావు, కటికి కిరణ్‌కుమార్, వారాల అజయ్, భూక్యా అంజయ్య, కృష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

30న భూ భారతి పోర్టల్ ఆవిష్కరణ

తల్లాడ: తల్లాడలో ఈ నెల 30న ఆర్‌బీ గార్డెన్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిచే భూ భారతి పోర్టల్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ హాజరౌతారని తెలిపారు.

పాఠశాలకు రంగులు వితరణ



పాఠశాలకు రంగులు వేసిన దృశ్యం

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు రంగులు వితరణగా అందజేశారు. పూర్వ విద్యార్థులు అందించిన రంగులతో సోమవారం పాఠశాలను ముస్తాబు చేశారు. మడుపల్లి హైస్కూల్లో 1970–75 సంవత్సరంలో చదివిన పంగా శేషగిరి, గుత్తా ప్రసాద్, చెరుకూరి రామయ్య, గడిపూడి సీతయ్య తదితర విద్యార్థులు రూ.50వేల విలువగల రంగులు అందించారు. దీంతో హెచ్ఎం నరసింహారావు వారిని అభినందించారు.

పేద విద్యార్థికి చేయూత



గౌతమికి నగదు అందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

బోనకల్: మండలంలోని రావినూతలకు చెందిన గౌతమి తల్లిదండ్రులు లేని బాధను దిగమించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470కి 467మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో ర్యాంక్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు దాతలు చేయూతనిస్తున్నారు. ఈక్రమంలోనే శ్రీనగర్ కాలనీ విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సోమవారం రూ.25వేల నగదు అందజేశారు. సంఘం బాధ్యులు మల్లెపల్లి సత్యనారాయణ, వీరయ్య, గోగినేని వెంకటేశ్వర్లు, రామారావు, ప్రసాదరెడ్డి, జానయ్య, డాక్టర్ ఎస్.జయసింహ, మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ తదితరులు పాల్గొన్నారు.

కనిపించని కల్లాలు.. రోడ్లపైనే వడ్లు

- ధాన్యం ఆరబోసుకునేందుకు స్థలం కరువు
- ఇక్కట్లు పడుతున్న రైతులు
- రోడ్ల పక్కన వడ్ల కుప్పలతో ప్రమాదాలు



రోడ్డుపై కాంటాలు వేసిన ధాన్యం బస్తాలు



విప్పలమడక సమీపంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

వైరారూరల్: చేతికొచ్చిన ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు లేకపోవడంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. పంటను సాగుచేయడం ఒక ఎత్తైతే.. దిగుబడులను కాపాడుకోని విక్రయించడం మరో ఎత్తు.. అధికారులు సకాలంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు స్థలాల కొరత వేధిస్తున్న నేపథ్యాన రైతులు ప్రత్యామ్నాయం లేక రహదారులపై ఆరబోస్తుండడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

మండలంలో ఇలా..

వైరా మండలంలోని గన్నవరం, దాచాపురం, గరికపాడు, సిరిపురం, నారపునేనిపల్లి స్నానాల లక్ష్మీపురం, పూసలపాడు, పలు గ్రామాల్లో ఇప్పటికే ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ శాతం కనీసం 17శాతం కంటే తక్కువగా ఉండాలి. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ. 2,320, కామన్ ధాన్యం క్వింటాకు రూ. 2,300 ధర నిర్ణయించారు.

వేధిస్తున్న స్థలాల కొరత..

వైరా రిజర్వాయర్ ఆయకట్టు కింద సుమారు 22వేల ఎకరాలు ఉండగా.. యాసంగి సీజన్‌లో రైతులు సుమారు 10వేల ఎకరాల మేర వరిసాగు చేశారు. ఇప్పటికే రైతులు కోతలు ముగించుకొని ధాన్యాన్ని విక్రయించే పనిలో నిమగ్నమవ్వగా.. అధికారులు, సొసైటీ నిర్వాహకులు తేమశాతం పరిగణలోకి తీసుకొని కొనుగోళ్లు చేస్తున్నారు. పలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టేందుకు తగిన స్థలం లేక రైతులు అసహనానికి గురవుతున్నారు. పోనీ దళారులకు అమ్ముదామంటే తగిన ధర పలకదు.. ఎం చేయాలో తెలియక పలువురు రైతులు రోడ్ల వెంబడి ధాన్యం ఆరబెట్టుకుంటూ కష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో పెద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడిన సందర్భాలు లేకపోలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే స్థలాన్ని కేటాయిస్తే బాగుంటుందని అన్నదాతలు కోరుతున్నారు.

పరిష్కారం చూపాలి..



కేంద్రాల్లో ధాన్యం తేమశాతాన్ని పరిగణలోకి తీసుకుని కొనుగోలు చేస్తున్నారు. దాంతో ధాన్యం అరబెట్టుకోవడం సమస్యగా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద తగిన స్థలం లేకపోవడంతో రహదారుల పైనే ధాన్యాన్ని అరబెట్టుకుని పడిగాపులు గాయాల్సి వస్తుంది. అధికారులు చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– ముక్కార పుల్లారెడ్డి, దాచాపురం

స్థలాలు కేటాయించాలి..



ప్రతి ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లలో వరి కోతలు ముగిశాక ధాన్యం ఆరబెట్టుకోవడం సమస్యగా మారింది. ఏళ్ల తరబడి రహదారిపైనో లేక పొలాల్లోనే ధాన్యం ఆరబెట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఇంత జరుగుతున్నా పట్టించుకేనే నాధుడే లేడు. ఇకనైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కేంద్రాల్లో కల్లాలకు స్థలాలు కేటాయించాలి.

– లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గరికపాడు

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర

ఎర్రుపాలెం: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర కోరారు. సోమవారం మండలంలోని మీనవోలు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఓ సాయిశివతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం తేమశాతం 17లోపు ఉండాలని, నాణ్యత ప్రమాణాలను పాటించి మద్దతు ధర పొందాలని సూచించారు. సన్న రకానికి తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న రూ.500 రూపాయలు బోనస్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు తానేటి సింధూర్, గోపి, ఐకేపీ సిబ్బంది సరోజని తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి అధికారులు గైర్హాజరు



అరకొరగా హాజరైన అధికారులు, ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

కొణిజర్ల: మండలంలోని తహసీల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. తహసీల్‌లో నిర్వహించి ప్రజావాణిలో ఉదయం 11గంటల వరకు తహసీల్దార్ రాము, ఎన్నెస్పీ ఏఈ, ఫిషరీస్ అధికారి మినహా ఏ ఒక్క మండలస్థాయి అధికారి రాలేదు. కొన్ని శాఖల కిందిస్థాయి ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇలా వచ్చి అలా సంతకం చేసి వెళ్లిపోయారు. ముఖ్యమైన శాఖ మండల పరిషత్, వ్యవసాయ శాఖ, మిషన్ భగీరథ, విద్యుత్ తదితర శాఖల అధికారులకు ప్రజావాణి ఉన్నట్లు గుర్తుందో లేదో తెలియన్నట్లున్నది. తమకేమీ పట్టనట్లు ఆ శాఖ అధికారులు ప్రజావాణి నిర్వహిస్తున్న తహసీల్ వైపు కూడా రాలేదు. దీనిపై తహసీల్దార్ రాము హాజరు కాని ఆయా శాఖల వారి గురించి వారి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

వినతుల వెల్లువ..

భూ సమస్యలపై కలెక్టర్‌కు..



కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు, ఏఐకేఎస్ నాయకులు

చింతకాని: నాగపూర్ – అమరావతి జాతీయ రహదారి భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఏఐకేఎస్ జాతీయ సమితి సభ్యుడు కొండపర్తి గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. అధికారులు జాతీయ రహదారి పనుల్లో భాగంగా కొదుమూరులోని రైతుల మొక్కజొన్న పంటను ధ్వంసం చేశారన్నారు. ఒక్కరోజు సమయం అడిగినా పట్టించుకోలేదన్నారు. అలాగే పంటపొలాలు వెళ్లేందుకు రహదారిపై అండర్‌పాస్, సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు కారణంగా తమ పంటలు నష్టపోతున్న రైతులకు తగిన పరిహారం ఇవ్వాలని, భూములు కోల్పోతున్న వారికి మార్కెట్‌రేట్ ప్రకారం ఎకరానికి రూ.25నుంచి 30లక్షలు చెల్లించాలన్నారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపూడి రవి, కోశాధికారి వెంగళరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని అదనపు కలెక్టర్ శ్రీజకు..



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు, ఏఐటీయూసీ నాయకులు

కల్లూరు: వీఓఏలకు వేతనాలు పెంచే ప్రభుత్వ హామీని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో కల్లూరు మండల వీఓఏలతో కలిసి అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకేపీ వీఓఏలకు నెలకు రూ.10వేలు వేతనం ఇచ్చేందుకు ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని ఆ హామీని అమలు పరచాలని కోరారు. పెండింగ్ వేతనాలు కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతా మహాలక్ష్మి, ఉపాధ్యక్షుడు రాంబాబు, ఐకేపీ వీఓఏల జిల్లా కన్వీనర్ నాగమణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



పశువుకు టీకా వేస్తున్న వైద్యాధికారి

చింతకాని: పశువ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ అరుణ పేర్కొన్నారు. మండలంలోని లచ్చగూడెంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులకు ఏవైనా వ్యాధులు సంభవిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే ముందు పశువుల్లో రక్త నమూనాలను సేకరించటం జరుగుతుందని తెలిపారు. టీకాలు వేసిన 28 రోజుల తర్వాత మరల పశువుల్లో రక్త నమూనాలను సేకరించి టీకా పనిచేసే విధానాన్ని పరీక్షిస్తామని తెలిపారు. గ్రామంలోని పశువుల్లో 10 రక్త నమూనాలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రామ్‌జీ, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు నవీన్, భాస్కర్, గోపాలమిత్రలు రాంచందర్, వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం విజయవంతం



పశువులకు టీకాలు వేసిన పశువైద్య సిబ్బంది

మధిర: మధిర మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాయపట్నం, జిలుగుమాడు గ్రామాల్లో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం విజయవంతమైంది. పుష్ వైద్య సిబ్బంది రఫీ అహ్మద్, లక్ష్మణరావు, కొండలరావు, కిరణ్ తదితరులు మాట్లాడుతూ.. మేలైన ముర్రా జాతి కృత్రిమ గర్భధారణ వీర్యంతోనే అధిక పాల దిగుబడి కలిగిన పశుసంపద అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో చిన్నారి ప్రతిభ



గోల్డ్ మెడల్ సాధించిన ధన్విత

సత్తుపల్లిటౌన్: మైసూరు శ్రీ దత్తపీటం నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో సత్తుపల్లికి చెందిన చిన్నారి సోమిశెట్టి ధన్విత ప్రతిభ చూపింది. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సోమిశెట్టి శ్రీధర్ కుమార్తె ధన్విత ఈ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి ప్రశంసపత్రం అందుకుంది. ఈ సందర్భంగా ధన్వితను ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు వందనపు సత్యనారాయణ, వాసవి క్లబ్ అధ్యక్షుడు షరాబు శివనాథ ప్రభు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చింతకాని: మండలంలో బీజేపీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని లచ్చగూడెంలో నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలన్నారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ మధిర కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు గోపి, నాయకులు సత్యనారాయణ, కృష్ణ, రామారావు, శ్రీను, తాతారావు, మంగయ్య, గోపాలరావు, సిద్దేమియా, నాగాచారి, ప్రవీణ్, విఘ్నేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

సుంకాల పెంపుతో వాణిజ్య యుద్ధం



మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

చింతకాని: కస్టమ్స్ సుంకాలతో ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య యుద్ధం ప్రకటించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాగులవంచలో నిర్వహించిన సీపీఎం మధిర డివిజన్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిత్ర, శత్రు దేశాలనే తేడా లేకుండా ట్రంప్ సుంకాలను విధిస్తుంటే.. కమ్యూనిస్టు దేశమైన చైనా మాత్రమే ట్రంప్ విధానాలకు దీటుగా సమాధానం చెబుతుందన్నారు. మోదీ వ్యతిరేకించకపోవటం బాధాకరమన్నారు. పహల్గాం ఉగ్రదాడి అత్యంత హేయమైన చర్య అని, దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యల పరిష్కారానికై పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మధిర డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, కార్యదర్శి గోపాలరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుశీలమ్మకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న హేమంతరావు

బోనకల్: సీపీఐ సీనియర్ నాయకుడు తూము ప్రకాశరావు సతీమణి, రాయన్నపేట మాజీ సర్పంచ్ సీపీఐ నాయకురాలు తూము సుశీలమ్మ(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతదేహాన్ని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, రాష్ట్రసమితి సభ్యులు జితేందర్ రెడ్డి, నరసింహారావు, వెంకటేశ్వరావు, వెంకటేశ్వరావు, ఎర్రాబాబు, రామాంజనేయులు, ఆనందరావు, కళావతి ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సౌజన్య, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిశోర్‌కుమార్, ఆత్మాకమిటీ చైర్మన్ రామకోటేశ్వరావు, మాజీ జెడ్పీటీసీ కొండ, సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు సుదర్శన్‌రావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాధం, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యుడు గోర్కీతో పాటు రాజకీయ నాయకులు ఉన్నారు.

పులి కనకదుర్గయ్యకు..



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తల్లాడ: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పులి కనకదుర్గయ్య చిత్రపటం వద్ద బీజేపీ నాయకులు సోమవారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, వీరవల్లి రాజేష్, తల్లాడ మండల అధ్యక్షుడు చల్లా నాగులు, నాయకులు రాయల రమేష్, సాయిచంద్, గొల్లమండల నరేష్, పులి వెంకటేశ్వర్లు, వేము అశోక్, బత్తుల బాలకృష్ణ, కొండ పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

మధిర: మధిర ప్రజావేదికలో మంగళవారం ఉపాధిహామీ పథకంపై సామాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో గత ఏడాది జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై 16వ విడత సామాజిక తనిఖీ నిర్వహించి నివేదికను వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్, సంబంధిత శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

సత్తుపల్లిటౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు పాకలపాటి జాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం కట్టెల పొయ్యిపై వంటచేసి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభావతి, నాగరత్నం, రాజ్యలక్ష్మి, షర్మిల, జయశ్రీ, షమీనా, రజీయా, సబేర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తీరిన రవాణా కష్టాలు



విస్తరణ పనులతో విశాలంగా ఉన్న జమలాపురం డబుల్ రహదారి

- రూ.25 కోట్ల నిధులతో పూర్తయిన డబుల్ రోడ్డు పనులు
- త్వరలో ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం భట్టి
- ప్రయాణికులకు రాకపోకలు సుగమం

ఎర్రుపాలెం: మండలకేంద్రం నుంచి తెలంగాణా తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా ఏపీ సరిహద్దు రాజుపాలెం గ్రామం వరకు ప్రభుత్వం డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసింది. ఈ రోడ్డు నిర్మాణానికి గానూ డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క రూ.25 కోట్ల మేరకు నిధులు మంజూరు చేశారు. దీంతో రోడ్డు నిర్మాణపు పనులు అధికారులు పూర్తి చేయడంతో ప్రయాణికుల కష్టాలు తీరాయి.

నెరవేరిన దశాబ్దాల కల..

దశాబ్దాలుగా జమలాపురం రోడ్డు గుంతలమయంగా, ప్రమాదకరంగా ఉండేది. సింగిల్ రోడ్డు కావడం, రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుతుండేవి. రాత్రి వేళల్లో వాహనాలు నడపలేని దుస్థితి ఉండేది. గత ప్రభుత్వ హయాంలో జమలాపురం ఆలయానికి, మండల పర్యటనకు విచ్చేసిన పలువురు మంత్రులకు అప్పట్లో భక్తులు, ప్రజలు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తులు చేసినా.. పట్టించుకున్న పాపాన పోలేదు.

– ఎర్రుపాలెం మండలం ఏపీకి సరిహద్దులో తెలంగాణ తిరుపతి జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఉండటంతో తెలంగాణ, ఏపీ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఓ సారి అటుగా శ్రీవారి దర్శనానికి వచ్చిన భట్టి విక్రమార్క రోడ్డు దుస్థితిని చూసి విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయగా.. అధికారులు పనులు పూర్తి చేశారు. దీంతో ఇటు భక్తులకు, అటు ప్రయాణికులు హాయిగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఎర్రుపాలెం మండలకేంద్రం నుంచి జమలాపురం వరకు 6కి.మీ మేర సెంట్రల్ లైటింగ్‌తో పాటు డివైడర్లు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరగడం లేదు..



మాకు దశాబ్దాలుగా ఉన్న కల నేడు నెరవేరింది. గతంలో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే క్షేమంగా గమ్యానికి చేరుకుంటామో లేదోనని భయమేసేది. కానీ ఇప్పుడు ఆ భయం లేదు. రోడ్డు బాగుండటంతో ప్రమాదాలు కూడా జరగడం లేదు.

– బానోత్ శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్, జమలాపురం

భట్టి చొరవతోనే..



గుంతల మయంగా ఉన్న రోడ్డు ఈ రోజు బాగుపడిందంటే అది కేవలం భట్టి చొరవతోనే సాధ్యపడింది. రోడ్డు బాగుకై గతంలో ఉన్న మంత్రులకు సమస్యను తీవ్రతను వివరంగా విన్నవించినా పట్టించుకోలేదు. భట్టి స్పందించి నిధులు మంజూరు చేయడంతో ప్రయాణం సుగమనం అయ్యింది.

– వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాజులదేవరపాడు

త్వరలో ప్రారంభిస్తాం..



ఎర్రుపాలెం టూ వయా జమలాపురం, రాజుపాలెం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాం. మండలకేంద్రం ఎర్రుపాలెం రైల్వే గేటు నుంచి వయా జమలాపురం మీదుగా రాజుపాలెం గ్రామం వరకు 13.5 కిమీ వరకు రోడ్డు నిర్మాణపు పనులు పూర్తి చేశాం.

– రాజేష్, ఆర్అండ్‌బీ ఏఈ